"ఏయ్ రిక్షా" అని పిలిచాడు మొదటి అతను. అక్కడకు కొంచెం దూరంలో సిగరెట్టు అప్పుడే ముట్టించుకుంటున్న రిక్షా అతను - దాన్ని ఆబగా రెండు దమ్ములు పీల్చి, విసిరిపడేసి వడివడిగా అక్కడికొచ్చేడు.

"అమ్మగారు - అయ్యగారు హోటల్ దగ్గర దిగుతారు. జాగ్రత్తగా తీసుకెళ్ళు. అయ్య గారు పది రూపాయిలిస్తారు తీసుకో. కొంచెం దూరం కదా" అన్నాడు.

రిక్షావాళ్ళని జనం సాధారణంగా 'ఏయ్ రిక్షా' అని పిలుస్తారు గనుక అతన్ని కూడా 'రిక్షా' అనొచ్చు. రిక్షాకి ఈ అయ్యగారు అమ్మగార్ల వ్యవహారం కొత్తేం కాదు. ఏ అయ్యగారు అమ్మగారు అంత దూరం రిక్షా ఎక్కరు. పది రూపాయిలివ్వరు. "ఎక్కండి" అన్నాడు ముఖం వికారంగా పెట్టి. అయ్యగారు ముందు రిక్షా ఎక్కాడు. ఆనక అమ్మగారు ఎక్కింది. రిక్షా ఎక్కుతూ 'రిక్షా' మొహం వైపు చూసింది ఆ అమ్మాయి - రిక్షా కదిలింది. కదిలి ముందుకు సాగింది. రిక్షాలో కూర్చున్న జంటకి మధ్య మాటలేం లేవు. అతని చెయ్యి ఆమె నడుము చుట్టూ పాములా పాకింది. పాములతో పొత్తు భయం లేనట్టు ఆ అమ్మాయి అలాగే కూర్చుంది.

అప్పుడా అమ్మాయి కాలక్షేపం కోసం తనకి తానే ఓ కథ చెప్పుకుంది. ఆ కథలో నాయిక పేరు సూరీడు.

సూరీడుకి పదిహేనేళ్ళొచ్చేసరికి అది సూర్యుళ్ళా మెరిసి పోయింది. పోత పోసిన బంగారు విగ్రహంలా మిడిసి పడింది. రాజ ప్రాసాదం నుంచి దాసి వేషంలో తప్పించుకుని సామాన్యుల ఇళ్ళల్లోకి వచ్చిపడిన రాజకుమారిలా ఠీవిగా వుంది. అంతఃపురంలో అసూర్యం పశ్యగా వుండడం వలన మిసమిస లాడే పసిమి ఛాయ, పట్టు దారాల్లాంటి నల్లటి నిడుపాటి వెంట్రుకలతో అల్లిన బారెడు జడ, నిర్మలంగా వున్న తెల్లటి అంతంత లేసి కళ్ళు - జలపాతంలా ఉరుకులు పరుగుల మీద వచ్చి పడుతూన్న వయస్సు - సూరీణ్ణి అపురూపంగా పెంచుకున్న తల్లి చనిపోతూ ఆ పిల్లని తమ్ముడికి అప్పగించింది. 'దీన్నేం జేస్తావో నీ యిష్టం' అంది.

తమ్ముడి పేరు నారాయణ. అతను సూరీడుకన్నా పదేళ్ళు పెద్ద. సూరీడు చిన్నప్పుడు ఉయ్యాల్లో గుక్కపట్టి ఏడుస్తూంటే అక్కని అనుకరిస్తూ జోలపాడిన వాడు - తను ఎత్తుకున్నప్పుడు ఆ చంటిది దోసిళ్ళతో జుత్తు పీకినప్పుడు బాధ కలిగి ఏడుద్దామనుకుని కూడా దాని బాల్య చేష్టలకి నవ్వేసినవాడు. సూరీడు తల్లి చనిపోయే నాటికి నారాయణ కొక చెల్లెలు పెళ్ళికుంది. ఆ పిల్లకి కొంచెం మెల్లకన్ను కావడంతో సంబంధం కుదరడం కష్టమైంది. చీటీ పాట పాడి నాలుగు వేలు తెచ్చి ఎలాగో ఆ యమ్మని అత్తవారింటికి పంపాడు నారాయణ. అంత క్రితమే అతను రిక్షా స్వంతానికి కొనుక్కున్నాడు. ఇప్పుడు మళ్ళీ సూరీడుకి పెళ్ళి చెయ్యాలంటే అప్పు చెయ్యాలి. సూరీడుకేం.. సినిమా స్టార్లంతా దాని ముందు బలాదూరే! అయినా కాస్తో కూస్తో కట్నమివ్వాలి కద!

"ఓరి నారాయణ! నేనా మంచంలో పడ్డానికి సిద్ధమైతిని! ముసలితనంలో అమ్మమ్మకి ఇంత కాచి పోస్తది. నువ్వంటే దానికి తగని ప్రేమ. దాన్ని నువ్వే ముడేసుకోరా! ఖర్చు కలిసొస్తది. లచ్చిలా ఇంట్లో వున్నా చాలు" అని సలహా ఇచ్చింది నారాయణ తల్లి. నారాయణ ముందు సందేహించేడు గానీ సూరీడు అంగీకారంతోనే ఆమెని తన భార్యగా చేసుకున్నాడు. తల్లి చెప్పనట్లు అది ఇంట్లో వున్నా చాలు - లచ్చిందేవే! దాని ముక్కుకొక ఎర్రరాయి ముక్కు పుడక బెట్టి చెవులకి జూకాలెడితే పెద్దింటి అమ్మాయిగార్లెవరూ పక్కన నిలబడలేరు. కంచి పట్టు చీరె కట్టి జానెడు మల్లె చెండెడితే ఈ పట్నంలో అందరూ దానికి దిష్టి బెట్టాల - నారాయణ సూరీణ్ణి ప్రేమించాడు. ఆ వాడకట్టులో వున్న పది ఇళ్ళల్లో ఏ మగవాడూ తన భార్యని చూడనంత అపురూపంగా సూరీణ్ణి తన గుండెలో నింపుకున్నాడు. అది తన పాలిటి దేవత అనుకునేవాడు. శివరాత్రి నాడు ఇద్దరూ కృష్ణ స్నానానికి వెళ్ళేరు. ముఖం నిండా పసుపు పూసుకుని కృష్ణలో మునిగి లేచి ఇవతలకి రాగానే ఫేలితో పట్టెడు కుంకుమ ముఖానికి పూసుకుంది.

"బావున్నావులే కనకదుర్గ అమ్మవార్లా - నాకు నిన్ను చూస్తే భయమేస్తా వుంది. ఇంటి కెళ్ళి సబ్బెట్టి మొహం కడిగి తిలకం ఎట్టవో" అన్నాడు.

అవును -పూజ్జేసి గుళ్ళో నించీ బయటికొస్తే అమ్మవార్లాగే వుంటుంది సూరీడు.

"ఇంట్లో కూచుని తింటే లావయి పోతావుగానీ రెండిళ్ళు పాచిపని సెయ్- సీటీలు తొందరగా తెమిలిపోవాల" అని సూరీణ్ణి తనే ఒకింట్లో పాచి పనికి కుదిర్చాడు నారాయణ. వాళ్ళ పిల్లల్ని అతను రిక్షాలో స్కూలుకి తీసుకుపోతాడు. ఆ అమ్మగారు దేవతలాంటిది, అయ్యగారు దేవుడి లాంటి వారు. బేరాలాడరు. ఎప్పుడైనా కాఫీ యిస్తారు. పండగలైతే టిఫిన్లు కూడా పెడతారు. నారాయణ పిల్లల్ని స్కూల్లో దింపితే, సూరీడు ఇంటెడు పనీ చేసేది. సూరీడు కిచ్చే జీతం తెచ్చి చీటీ కట్టేవాడు నారాయణ. నారాయణకి తాగుడు లేదు, సిగరెట్టు లేదు. ఎప్పుడైనా లాటరీ టిక్కెట్లు కొనడం - సూరీడుకి తినడానికేదైనా తేవడం, పూలు కొనడం - ఇద్దరూ కలిసి సినిమాలకెళ్ళడమే గానీ - ఇంకే ఖర్చూ లేదు. సూరీడు సంసారం ఆరు బయట నులక మంచం పైన వెన్నెల్లో సరసంలా, రోజూ మూరెడు మల్లెపూల దండగా - ఏరోజూ త్వరగా తెల్లారిపోయే రాత్రిగా - ఎప్పుడూ సంతోషమేగాని మూతివిరుపులు - తిట్లు సాధింపులూ లేని స్వర్గసీమగా గడిచిపోయింది. రెండేళ్ళు. నారాయణ చీటీలు తీరిపోయాయి. సూరీడుకి ముక్కుపుడక చేయించడమే మిగిలింది. అప్పుడతని చెల్లి పురిటికి వచ్చింది. పురిటికి వచ్చిన చెల్లికి చాలా జబ్బు చేసింది. బిడ్డ దక్కలేదు. మూడువేల రూపాయల్తో తల్లి బయట పడింది. నారాయణ మళ్ళీ క్రొత్తగా చీటీ పాడాడు. మళ్ళీ అప్పు చేసేడు. ఆ సందడిలోనే అతని తల్లి కూడా వెళ్ళి పోయింది. ఆమె దినవారాలకి మళ్ళీ అప్పు చేశాడు. ఆ అప్పులు తీరడానికి సూరీడు పని చెయ్యాలి తప్పదు. కష్టపడ్డం కష్టం ఏం కాదు సూరీడుకి.

అతనికి సాయం చేయగలుగుతున్నందుకు ఆమె సంతోషించింది కూడా. అయితే అప్పుడే ఒకనాడు -

సూరీడు ఆ ఇంటికిక పనికెళ్ళనని మొండికేసింది. కారణం చెప్పదు. కన్నీళ్ళెట్టు కుంటుంది. ముందు బ్రతిమిలాడేడు నారాయణ. తర్వాత చిరాకుపడ్డాడు. "చీటీలయ్యేదాకా చెయ్యి, తరువాతొద్దు- బంగారు తల్లిగా – నీ కాళ్ళట్టుకుంటా"నన్నాడు." నేను ముక్కు పుడక చేయిస్తా"అన్నాడు. పట్టీలు కొంటానన్నాడు.

సంక్రాంతి పండక్కి సిల్కు చీరె తీస్తానన్నాడు.

ససేమిరా వెళ్ళనన్నది సూరీడు.

"మకురుతనం, రెండ్రోజులు పోనియ్' అనుకున్నాడు నారాయణ.

మూడోరోజుదయం పిల్లల కోసం రిక్షా తీసుకెళ్ళినప్పుడు ఓ ముసలమ్మ ఆ వాకిట్లో ముగ్గెయ్యడం చూశాడు నారాయణ.

"అమ్మగారూ- సూరీణ్ణి పనిలోంచి తీసేసినారా?" అని వినయంగా అడిగేడు.

"ఏం? అది నీకు చెప్పలేదా? రావలసిన జీతం కూడా యిచ్చేశాను. ఏం? నువ్వు రిక్షా వెయ్యవా మీ ఆవిణ్ణి తీసేస్తే - చెప్పు- ఇంకో రిక్షా మాట్లాడుకుంటాం" అంది ఆ అమ్మగారు.

నారాయణ బిత్తర పోయేడు. "అదేంటమ్మా - అదేవైనా తప్పు చేస్తే నాకు చెప్పొచ్చు గందా!'" అన్నాడు మళ్ళీ వినయంగానే.

"నీకు చెప్పే తప్పు కాదులే నారాయణా! అదంతా ఇప్పుడెందుకు! ఏదో మమ్మల్నిలా బ్రతకనియ్. నీకిష్టమైతే పిల్లల్ని తీసుకెళ్లు లేకపోతే మానెయ్" అందావిడ కఠినంగా.

ఆ రాత్రి నారాయణ సూరీణ్ణి గుచ్చి గుచ్చి అడిగేడు ఏం జరిగిందని. సూరీడు కంటికి కడివెడుగా ఏడ్చి "దేవుడిలాంటి అయ్యగారు" నిజంగా దేవుడు కాడనీ దేవుడి ముఖం తగిలించుకున్న జంతవు అనీ - ఆ జంతువు బారి నించీ తప్పించుకోడానికే తను మానేశాననీ చెప్పింది.

"మరి అమ్మగారలా అందేం?" అన్నాడు నారాయణ.

"అలా అందా! అయితే ఆవిడ దేవత కాదన్న మాట. దేవత మొహం తగిలించుకున్న దెయ్యం"అంది సూరీడు.

"మరి ఆ జంతువు అక్కడుంటే రెండేళ్లు నవ్వుతూ తుళ్ళుతూ ఎలా పని చేశావు?" అన్నాడు నారాయణ.

అతను రెండేళ్ళ నించీ దేవుడి ముఖం తగిలించుకునే వున్నాడనీ, ఆ ముఖం ఇప్పుడిప్పుడే తీసేసి అసలు స్వరూపాన్ని బయట పెట్టుకుంటున్నాడనీ, అది నిజం, నమ్మమనీ మొర పెట్టుకుంది సూరీడు.

